
మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట


## ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తిటౌన్ మార్చి 3,ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 22 దరఖాస్తులు వచ్చాయని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్‌లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**బాలానగర్ మార్చి 3 ప్రభాతవార్త :** బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి, ఎంఈఓ శంకర్ నాయక్ పరిశీలించారు. మార్చి 5వ తేదీ నుండి 22వ తేదీవరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈ కేంద్రంలో ప్రతిరోజు దాదాపు 450 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో అవసరమైన అన్ని వసతులను కల్పించి, విద్యార్థులను ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు వ్రాసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వారు కళాశాల ప్రిన్సిపల్ రమేష్ లింగంకి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై పలు సూచనలు చేశారు.

## ప్రజావాణికి 35 ఫిర్యాదులు....

### ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి


దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, మార్చి 3 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చేసిన ప్రజల నుండి వారి సమస్యలపై 35 ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మినారాయణ, నర్సింగరావులతో కలసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి నమ్మకంతో వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను అర్హతల మేరకు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నిరంతరంగా.. నిర్విరామంగా..



- 11రోజులుగా శ్రమిస్తున్న 12బృందాలు..
- అయినా దొరకని కార్మికులు ఆచూకీ
- జాడకోసం కేంద్ర,రాష్ట్ర బృందాల తండ్లాట
- ఎస్ఎల్బీసీ సొరంగంలో వేగంగా సహాయక చర్యలు
- కన్వేయర్ బెల్ట్ పనులు వేగవంతం


రెస్క్యూ ఆపరేషన్‌పై సమీక్షిస్తున్న డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, కలెక్టర్ సంతోష్,అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 3, ప్రభాతవార్త:** 11రోజులుగా 12 కేంద్రం, రాష్ట్ర బృందాలు నిరంతరంగా నిర్విరామంగా శ్రమిస్తున్నా ఫలితం లేకపోతున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం చేశారు.

ఎస్ఎల్‌బిసి ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని తొలగించేందుకు కన్వేయర్ బెల్టు పనులను వేగవంతం చేసినట్లు డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ వివరించారు. సోమవారం ఎస్ఎల్‌బిసి టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ లో పాలుపంచుకుంటున్న బృందాల అధికారులతో డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, టన్నెల్ ఇన్ లెట్ ఆఫీస్ వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు (ఎస్ఎల్బీసీ)లో సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మెనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఆలీ,నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్ అధికారి, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.




టన్నెల్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

**వేగంగా డీవాటరింగ్..**

కన్వేయర్ బెల్ట్ మరమ్మతు పనులు వేగవంతం చేసి ఎస్ఎల్బీసీ ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. డీ- వాటరింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని, రెస్క్యూ ఆపరేషన్లో పాలుపంచుకుంటున్న బృందాల అధికారులతో డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రమాద ప్రదేశంలో జరుగుతున్న సహాయక చర్యలకు ఎదురవుతున్న సమస్యలపై విశ్లేషించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న 12సంస్థలకు సంబంధించిన బృందాలతో అధికారులు సహయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ , చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక అధికారులతో సలహాలు, సూచనలు తీసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో సొరంగం లో మట్టి, బురద, కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఎల్బీసీ సొరంగంలోకి మీద నుంచి, ఇరువైపుల నుంచి నీరు రాకుండా... అలాగే సొరంగంలో ఇప్పటికే నిలువ ఉన్న నీటిని తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు. దీనికోసం ప్రత్యేకంగా యంత్రాలు నిరంతరం పని చేస్తున్నాయని అధికారులు వివరించారు.

# యెన్నం ఆశయానికి.. అడుగులు



- వేదిక అవుతున్న మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రం
- మొదటి బ్యాచ్‌లో శిక్షణ పొందిన 224 మంది
- ఉపాధితోపాటు రుణాలు అందించేందుకు చర్యలు
- ఆనందంగా ఉంది : సెట్విన్ ఎండి కె.వేణుగోపాల్ రావు



**మహిళలు శక్తి స్వరూపం..**

మహిళలు బాగుంటేనే కుటుంబం బాగుంటుంది. కుటుంబం బాగుంటేనే సమాజం బాగుంటుంది. మహబూబ్‌నగర్‌లో ప్రతిభకు కొదవ లేదు. మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలులో భాగంగా మూడు నెలలపాటు శిక్షణ ఇప్పించాం. 224మంది శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధితోపాటు రుణాలు కూడా అందించే వెసులుబాటు కల్పిస్తాం. శిల్పారామంలో మహిళల ఉత్పత్తుల కోసం ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తాం. మహిళలు శక్తి స్వరూపులు.

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 3, ప్రభాత వార్త:** ఎమ్మెల్యే యెన్నం ఆశయాలకు అడుగులు పడుతున్నాయి. మహబూబ్‌నగర్ ఫస్ట్ పేరిట స్థాపించిన శిక్షణ కేంద్రంలో ఒక్కో బ్యాచ్‌గా శిక్షణపొంది ఉపాధి పొందేందుకు ముందుకుసాగుతున్నారు. ఇకమీదట మహిళలు కూడా ఆత్మగౌరవంతో సగర్వంగా తలెత్తుకుని తిరుగుతూ స్వయం ఉపాధితో నిలదొక్కుకోనున్నారు.మహిళలు శక్తి స్వరూపులన్న ఎమ్మెల్యే మాటలు నిజం కానున్నాయి. ఎమ్మెల్యే సొంత నిధులతో తన మెదడులో తట్టిన ఆలోచనలకు జీవం పోస్తూ రూపొందించిన ఫస్ట్ కార్యాచరణ వేలాది మందికి విద్యా, ఉపాధి కల్పించే దిశగా దారి చూపనున్నది. మూడు నెలలుగా వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో తర్ఫీదు పొంది సోమవారం నుంచి పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారంతా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రంలో మొదటి బ్యాచ్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నది. శిక్షణ పొందిన వారంతా సోమవారం ఫైనల్ పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ శిక్షణ పొందిన వారంతా ఫైన్ పరీక్షలు రాయడం ఆనందంగా ఉందని – మిగతా3లో..

## దివ్యాంగులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి

### - మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 3, ప్రభాతవార్త:** జిల్లాలోని దివ్యాంగులు సదరం సర్టిఫికేట్ లు పొందుటకు కొరకు ఇక నుండి వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో మీసేవ సెంటర్ ఆపరేటర్లకు 21 వైకల్యాలకు సదరం గుర్తింపు పొందడం పై దివ్యాంగుల వివరాలు మీ సేవ కేంద్రాల్లో నమోదు పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సదరం క్యాంపునకు హాజరగుటకు ముందుగా దివ్యాంగులు మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని / ఇది పబ్లిక్ వెబ్ పోర్టల్ కావున అవగాహన ఉన్న వారు ఫోన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గించకూడదని డేటా ఎంట్రీ విషయములో తప్పులు లేకుండా జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని మీసేవ కేంద్రాల వారిని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,అదనపు డి.అర్.డి. ఓ జోజప్ప, ఈ.డి.ఎం.చంద్ర శేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## పెండింగ్ దరఖాస్తులపై ఫోకస్ పెంచాలి : జిల్లా కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్‌బ్యూరో,మార్చి3 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్ర మానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 86 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని – మిగతా3లో..

## పదవ తరగతి పరీక్షల కోసం జిల్లాలో 39 కేంద్రాలు ఎంపిక

### నారాయణపేట జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు

**నారాయణపేట టౌన్,మార్చి3 ప్రభాతవార్త :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి2025 నిర్వహణకోసం జిల్లాలో 39కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని జిల్లావిద్యాశాఖ అధికారి గోవిందరాజు అన్నారు. జిల్లా మొత్తం మీద 7637 మంది విద్యార్థులు రెగ్యులర్గా 65మంది విద్యార్థులు వన్స్ ఫెయిల్డ్ అభ్యర్థులు పరీక్ష రాయబోతున్నారు. ఈ పరీక్ష నిర్వ హణ కోసం 39 చీఫ్ సూపరింటెండెంట్లు 39 డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు 6 మంది సి కస్టొడియన్లు ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని నియమించి నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు తెలియజేశారు. సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఎక్కడ కూడా రూల్స్‌కు విరుద్ధంగా పని చేయరాదని, నియమ నిబంధనలు అతిక్రమించ కుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని కోరారు.అమ్మాయిలకోసం ప్రతి సెంటర్లో ప్రత్యేకమైన కేబినెట్ ఏర్పాటుచేయాల్సిందిగా కోరారు.సిఎస్,డివోలు, ఇన్విజిలేటర్ మొబైల్ ఫోన్లు స్మార్ట్ వాచీలు తీసుకుని రాకూడదని తెలియజేశారు. ఎగ్జామినేషన్లో పాలుపంచుకునే ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేసే జిల్లాకు మంచి పేరు తేవాలని పరీక్షలను సజావుగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎంఈఓకృష్ణరెడ్డి,బాలాజీలు ఏసిజిఈ ఆంజనేయులు,సీఎంఓ, డీసీఈబి సెక్రటరీ రాజేంద్రకుమార్,యాదయ్య శెట్టి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

**నారాయణపేట టౌన్, మార్చి 3 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ. రాంచందర్, ఎ.ఓ జయసుధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

### తగు ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలి : జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ విజయేంద్ర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, అందువల్ల వడదెబ్బ గురికాకుండా తీసుకునే ముందస్తు జాగ్రత్తలపై పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని తెలిపారు. వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు డాక్టర్ సలహాలను పాటించాలని, ఎండ సమయంలో బయటికి వెళ్లకుండా ఉండాలని, తప్పని పరిస్థితి బయటికి వెళ్ళవలసి వస్తే తలపై టోపీ ధరించి వెళ్లాలని, సరిపోయినంతగా తాగునీరు తీసుకోవాలని ,ఓఆర్ఎస్ పాకెట్లు, నిమ్మరసం, మజ్జిగ,పండ్లరసాల వంటివి తరచూ తీసుకుంటూ ఉండాలని తెలిపారు. సన్నని,వదులుగా ఉండే,లేత రంగుదుస్తులు వాడటం, –మిగతా3లో..

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : జిల్లా ఎస్‌పి



**నారాయణపేట టౌన్, మార్చి 3 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి మొత్తం 05 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సీఐ, ఎస్సైలకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు. భూములకు సంబంధించి గొడవలు పెట్టుకోరాదని అందరూ సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని కోరారు. అధికారులు బాధితులు తీసుకొచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఫిర్యాదులు పెండింగ్లో ఉంటే వాటికి సంబంధించిన సమాచారాన్ని బాధితులకు తప్పకుండా తెలపాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి : డిఎస్పీ


ప్రజావాణిలో మాట్లాడుతున్న డిఎస్పి మొగులయ్య

**గద్వాల, మార్చి 3 ప్రభాతవార్త :** పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి చట్ట ప్రకారం చర్య తీసుకొవడం జరుగుతుందని డి.ఎస్పి వై.మొగులయ్య అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డి.ఎస్పి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 08 మంది బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన డి .ఎస్పి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులో భూ వివాదాలు, కుటుంబ అస్తి పంపకాల తగాదాలు, సైబర్ మోసాలు, వేధింపులు, ఇతర అంశాల పై వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకొనీ వెంటనే రిపోర్ట్ పంపాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో గద్వాల్, ఆలంపూర్, శాంతి నగర్ సీఐలు టీ.శ్రీను, రవి బాబు, టాటా బాబు పాల్గొన్నారు.

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న మోష

**ఆత్మకూరు, మార్చి 3 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాబా కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు కొనసాగిస్తున్న భూ అక్రమ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష తదితరులు డిమాండ్ చేశారు. బాబా కాలనీలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని గడచిన ఆరురోజులుగా ఆత్మకూరులోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిక దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం రోజు దీక్షా శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ఏఐటీయూసీ నాయకులు సందర్శించి ఇప్పటికైనా జిల్లా అధికారులు మున్సిపల్ అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అక్రమంగా నిర్మిస్తున్నటువంటి నిర్మాణాన్ని తక్షణమే కూల్చివేయాలని వారు విజ్ఞప్తి చేశారు లేదు పక్షంలో భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అబ్రహం భాస్కర్ కుతుబ్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని కాపాడండని వినూత్న నిరసన


సమస్యను తెలుసుకుంటున్న కమిషనర్

**అమరచింత, మార్చి 3 ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ కందకస్థలాన్ని అధికారులు కాపాడాలంటూ అమరచింత పట్టణానికి చెందిన యువకుడు ఫిరోజ్ రాజు సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని,ప్రభుత్వస్థలంలో సూచికబోర్డు ఏర్పాటు చేయాలని ప్లే కార్డు పట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫిరోజ్ రాజు మాట్లాడుతూ, పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ స్థలంలో జిల్లా కలెక్టర్ సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని గతంలో అధికారులకు చెప్పిన ఇప్పటి వరకు సూచిక బోర్డు ఏర్పాటు చేయడంలేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి గ్రామ కంట భూమిలో సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిబాబు నిరసన తెలుపుతున్న యువకుని కార్యాలయం లోపలికి పిలుచుకొని సమస్యపై వినతి పత్రం ఇవ్వాలని కోరడంతో ఫిరోజ్ రాజు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.

## ఇష్టంతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలి


రికార్డులను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారి

**ఆత్మకూరు, మార్చి 3 ప్రభాతవార్త :** త్వరలో జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విద్యార్థిని విద్యార్థులు ఇష్టంతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని వనపర్తి జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి అంజయ్య సూచించారు. సోమవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా అతనికి నిర్వహించి పలు రికార్డులను ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ వార్షిక పరీక్షల్లో విద్యార్థిని విద్యార్థులు కష్టపడే విధానం పట్ల పలు సూచనలు చేశారు. జీవితంలో స్థిరపడాలంటే ఇంటర్మీడియట్ ఒక ఆశాకిరణంగా ఉంటుందని ఇం టర్‌లో రాణించినవారు భవిష్యత్తులో సుస్థిరమైన స్థానాలు ఏర్పరచుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన సూచించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థిని విద్యార్థులు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా కఠినంగా వ్యవహరించాలంటూ ఆత్మకూరు కళాశాల ప్రిన్సిపల్ భాగ్య వర్ధన్ రెడ్డికి ఆయన సూ చించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలోని కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం కురుమూర్తి డీజే విశ్వేశ్వర్ తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## గ్రామాలలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలి సిపిఎం డిమాండ్


పామిరెడ్డి పల్లె గ్రామంలో సిపిఎం నాయకులు పర్యటన

**అమరచింత, మార్చి 3 ప్రభాతవార్త :** గ్రామాలలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల నాయకులు బి.వెంకటేష్ ,ఎస్. అజయ్ డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 3 నుండి 31 వరకు గ్రామ సమస్యల పై సర్వేలో భాగంగా సోమవారం మండలంలోని పామిరెడ్డి పల్లె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా బి.వెంకటేష్ ,అజయ్ మాట్లాడుతూ, గ్రామంలో డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపై పారుతున్నాయని ము రుగునీరు వల్ల విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని వెంటనే అధికారులు డ్రైనేజీ నిర్మించాలని అలాగే పాఠశాల గ్రౌండ్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ శిథిల వ్యవస్థలో ఉన్నదని వెంటనే అధికారులు వాటర్ ట్యాంక్ ను తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని వారి డిమాండ్ చేశారు. వృద్ధులకు వితంతువులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెన్షన్లను అమరచింత పోస్ట్ ఆఫీస్ లో ఇవ్వకుండా గ్రామంలోనే పెన్షన్లు ఇవ్వాలని వారు అధికారులను కోరారు. గ్రామంలో దేవాలయం నుండి నర్వ గ్రామానికి వెళ్లే దారికి రోడ్డు వేసి ప్రజలకు రావణ సౌకర్యం కల్పించాలని రోడ్డు కబ్జాకు గురికాకుండా అధికారులు సర్వే నిర్వహించాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో శంకర్ ,మహేష్ ,మోహన్ ,అంజిరెడ్డి ,అశోక్ ,మహేష్ ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నెక్లెస్ రోడ్‌లో ఉన్న నిరా కేఫ్‌ను టడీ కార్పొరేషన్‌కు అప్పగించాలి

### గౌడజన గీత కార్మిక తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రామన్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

**పెబ్బేరు, మార్చి3 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో గత ప్రభుత్వం నెక్లెస్ రోడ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నీరా కేఫ్ ను ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని గౌడజన గీత కార్మిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రామన్ గౌడ్ పెబ్బేర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆప్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉండి టూరిజం ఎండి ప్రకాష్ రెడ్డి ద్వారా ఉత్తర్వులు జారీ చేయించడం జరిగిందని గౌడ కులస్తులపై కక్ష సాధించాలని చూస్తే గౌడ సత్తా చూపాలనిపిస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర బడ్జెట్లో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 25 కోట్ల రూపాయలతో టడి కార్పొరేషన్ ద్వారా దీని కోసమే ఖర్చు చేశారు. ఈ కేఫ్‌లో 6 స్టాల్స్ ఒక హాల్ రెంటుకి ఇచ్చి ఒక స్టాల్ నీరాకు కేటాయించింది. ప్రైవేట్ సంస్థ చే నీర ఫామ్ ప్రొడక్ట్ డెవలప్మెంట్ సొసైటీ టిపిడిఎస్ ద్వారా 160 రూపాయలకు లీటర్ కొనుగోలు చేసి 300 రూపాయల చొప్పున అమ్మి లాభాలు పొందారని అయినా నష్టాలు వస్తున్నాయని చెప్పి దీనిని తీసివేయాలని చూస్తున్నారని ఈ నెల 1వ తేదీన రాష్ట్రంలోని అన్ని గౌడ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి చర్చించడం జరిగింది. రాష్ట్రంలోని కల్లుగీత సొసైటీలు 4366, టీ ఎఫ్ ఎఫ్ టి 3709 ద్వారా సభ్యత్వం కలిగిన వారు 2 లక్షల 18 వేల మంది ఉన్నారని వృత్తి చేస్తూ సభ్యత్వం లేని వారు ఇంకా వేలాది మంది ఉన్నారని సుమారు ఐదు లక్షల కుటుంబాలు వృత్తిపై ఆధార పడి జీవిస్తున్నారు. కల్లు గీత వృత్తిపై ఎక్కువగా ఉన్నాయని ఈ పదేళ్ల కాలంలో దాదాపు 5450 మంది ప్రమాదానికి గురయ్యారని వీరులో 778 మంది చనిపోయారని దీన్ని బట్టి గీతా వృత్తి ఎలాంటి ప్రమాదకరమైందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచం పేరుతో సేఫ్టీ కిట్టును తప్ప మిగతా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదని జులై 14న అబ్దుల్లానిలస్కర్ గుడా లో గీతా కార్మికులతో సభ నిర్వహించిన ముఖ్యమంత్రి కాటమయ్య రక్షణ కవచనం విడుదల చేసి అనేక హామీలు ఇచ్చారని మాటలు తప్ప చేతలు లేవని వారి మాటలతో కాలం వెల్లదిస్తున్నారని కాటమయ్య రక్షణ కవచని అందరు గీతా కార్మికులు తక్షణ అందించి ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ 8 నెలల కాలంలో పదివేల మందికి ఎలా వాడాలో ట్రైనింగ్ ఇప్పిచ్చి రక్షణ కవచని పంపినీ చేశారు ఇంకా 10,000 మందికి మంజూరు చేశారు. ఇది మంచి విషయమే కానీ ప్రభుత్వం లెక్కల ప్రకారం సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 50 వేలు మంది గీత కార్మికులు ఉన్నారు సభ్యత్వం లేకుండా వృత్తిచేసే వాళ్ళు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. కొన్ని గ్రామాలకు అసలు రక్షణ కవచాలు ఇంతవరకు అందలేదు వచ్చిన గ్రామాలకు కూడా ఒకటి రెండు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మిగతా వాళ్ళ పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. అలాగే వృత్తిలో ప్రమాదంలో జరిగిన వారికి టడి కార్పొరేషన్ నుంచి ఇస్తున్న తక్షణ సహాయం దహన సంస్కారాల కోసం 25 వేలు, గాయాలైన వారికి 15000 బడ్జెట్లో లేదనే పేరుతో నిలిపేశారని తక్షణమే బడ్జెట్ రిలీజ్ చేసి ఆదుకోవాలని కొత్తగా పథకాలు పెట్టకపోగా ఉన్న సాయాన్ని వెంటనే ఆర్థిక సాయం పునరుద్ధించాలని గౌడ కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఎస్ రంగసామి గౌడ్, ఎస్ రమేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, జి.నరసింహ గౌడ్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చట్ట వ్యతిరేకం

### ఇష్టానుసారం సర్క్యులేట్ చేస్తామంటే చట్టం చూస్తూ ఊరుకోదు : నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మక్తల్‌టౌన్, మార్చి 3 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ రవికుమార్ అధ్యక్షతన సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో నిర్వహించారు. మండలకాంగ్రెస్ అధ్యక్షులు గణేష్ కుమార్ నాయకుల సమక్షంలో మాటాడుతూ డా.వాకిటిశ్రీహరి ముదిరాజ్ గతంలో ఎమ్మెల్యే టికెట్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు ఆయన దగ్గర డబ్బులు లేవని, ఆయన ఎమ్మెల్యేగా గెలవలేదని అసత్య ప్రచారాలు చేసి నిందించారని,తాజాగా ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇప్పుడు డబ్బులు భారీ స్థాయిలో కూడ పెట్టుకుంటున్నారని నిందలు వేస్తున్నారని, అతి త్వరలో ఆయనకు మంత్రి పదవి రాబోతుందని,వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తే నియోజవర్గంలో తమకు రాజకీయంగా భవిష్యత్తు ఉండదనే అక్కసుతోనే కొందరు రహస్యంగా ఎమ్మెల్యే పేరుమీద అసత్యప్రచారాలతో కరపత్రాలు విడుదల చేస్తున్నారని భగ్గుమన్నారు.నియోజవర్గంలో దాదాపు రూ.170కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, 150 పడకల ఆసుపత్రిని అతి త్వరలో ప్రారంభించుకునేందుకు చర్యలు చేపడుతున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా దాదాపు 30 సంవత్సరాలకు పైగా ప్రజల డిమాండ్ లో ఉన్న మక్తల్ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకంతో ఉట్కూరు పరిసర ప్రాంతాల్లో సాగుభూములకు సాగునీరు ఇచ్చేందుకు ఎత్తిపోతల పథకాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తో పాటు ఆయన కుటుంబ సభ్యుల పైన గుర్తు తెలియని వ్యక్తులు చేస్తున్న కుట్రలను అతిత్వరలో పోలీసులు బయటపెడతారని, అందుకు వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాయత్రి అనిల్, గొల్లపల్లి నారాయణ, వల్లంపల్లి లక్ష్మణ్, ఆడం శ్రీనివాసులు,వాకిటి శ్యామ్,మార్కెట్ డైరెక్టర్లు ఫయాజ్ శ్రీనివాసులు, రంజిత్ రెడ్డి, నేతలు రాయికోడ్ ఆనంద్, హేమ సుందర్, శంషుద్దీన్, గడ్డం రమేష్, వాకిటి హనుమంతు, ఓబ్లేష్, చెన్నయ్య గౌడ్, కర్ని దత్తు, బహదూర్, గుంతలి రవి,నాగరాజ్, అశోక్ గౌడ్,నీలాగౌడ్,ఆనంపల్లి రమేష్,శేఖర్,బ్యాగరి సురేష్,మెకానిక్ రాము,బోయ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పరమేశ్వర స్వామి జాతరలో ఎడ్లబండ్ల గిరక పోటీలు ప్రారంభం


జాతరలో ఎడ్లబండ్ల గిరక పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

**ఆత్మకూరు, మార్చి3 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణసమీపంలోని చర్ల పరమేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గత రెండురోజులుగా కొనసాగుతున్న తేరు రథయాత్రలో భాగంగా సోమవారంరోజు మఖ్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు పరమేశ్వర స్వామి జాతరలో ఎడ్లబండ్ల గిరక పోటీలను స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర స్వామి జాతర కమిటీ చైర్మన్ దివాంజి వెంకట నరసింహారావు మాట్లాడుతూ గడచిన కొన్ని సంవత్సరాలుగా పరమేశ్వర స్వామి జాతరలో ఎలాంటి క్రీడలు గాని భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడం మూలంగా ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని ప్రస్తుత శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు పరమే శ్వర స్వామి జాతరలో భక్తుల కోసం ప్రత్యేకంగా చెరువులో బోటును ఏర్పాటు చేయడమే కాకుండా జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్, ఎడ్లబండ్ల గిరక పోటీలను ప్రారంభించి జాతరలో అధిక సంఖ్యలో భక్తులు ప్రజలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు యాదగిరి శెట్టి, మని వర్ధన్ రెడ్డి వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొగిలి, గంగాధర్ గౌడ్ ,ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్ ,మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా,నియోజకవర్గ యువ జన కాంగ్రెస్ నాయకులు తులసిరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలపై దాడులను ఆపడానికి తగుచర్యలు తీసుకోండి

### జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన అఖిల పక్షం నాయకులు


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

**గద్వాల, మార్చి3 ప్రభాతవార్త:** వక్ఫ్‌బిల్లును ఉపసంహరించుకోవాలని మైనార్టీల కోర్కెను ప్రభుత్వానికి మీద్వారా తెలియచేయాలని గద్వాల జిల్లాఅఖిలపక్షం పార్టీలనాయకులు సోమవారం జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అఖిల పక్ష కమిటి ఎస్సీ ,ఎస్టీ,బీసీ,మైనార్టీల ఐక్య వేదిక జోగులాంబ గద్వాల జిల్లా తరుపున తమరితో చేయు మనవి ఏమనగా దేశంలో రోజు, రోజుకు మత మైనార్టీల పై దాడులు సర్వసాధారణమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ వత్తాసుతోనే ఇటువంటి దాడులు జరుగుమన్నాయనే ఆరోపణ, వేదన వారిలో వుందని కలెక్టర్ కు తెలిపారు. అగ్నికి ఆజ్యం పోసినట్లు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం " వక్ఫ్ బిల్లు" తేవటం వల్ల తమ హక్కులను ప్రభుత్వం కాల రాస్తున్నదని, తమ తిండిపై, సాంప్రదాయాలపై దాడి జరుగుతున్నాదని తెలిపారు. వక్ఫ్ ఆస్తులపై బోర్డుకు వున్న పరిమితమైన అధికారాలను కూడ తీసి వేస్తున్నదని నిరసనగా వున్నారు. వారిహక్కులపై దాడి ఖండిస్తూ ఈ నెల 1న గద్వాలలో "రాజ్యాంగ పరిరక్షణ" వక్ఫ్ బిల్లు పై పౌర చర్చ సదస్సు " అనేకమంది మేధావులు,మతపెద్దల,పౌరసమాజం ఆధ్వర్యంలో జరిగిందని తెలిపారు. ఈ చర్చలో " వక్ఫ్ బిల్లు " సవరణను ప్రభుత్వం విరమించుకోవాలని, మీ ద్వారా విన్న విస్తున్నాము అన్నారు. అదేవిధంగా జిల్లా మత సామరస్యాన్ని కాపాడానికి మీ వంతుగా సభలు, సమావేశాలు నిర్వహించి ఆదర్శవంతమైనజిల్లాగా ఈజిల్లా రూపుదిద్దాలని పౌరసమాజం తరుపున తమరికి విజ్ఞప్తి చేస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్ దొడ్డి వెంకట రాములు, అడ్వకేట్ మధుసూదన్, జమీయత్ ఉలేమా హింద్ ప్రెసిడెంట్ మోలానా మొహమ్మద్ అబ్బాస్, అతికూర్ రెహమాన్, మైనారిటీ సబ్ ప్లాన్, ఇస్కాక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కురువ పుల్లయ్య, బీఆర్ఎస్‌వి కోఆర్డినేటివ్, శంకర ప్రభాకర్ టిపిఎఫ్ ఇక్బాల్, పాలమూరు అధ్యయన వేదిక, వాల్మీకి, బహుజన రాజ్యసమితి, మోలానా ఖదీర్,మహబూబ్ అలీ,ఆటోచాంద్,రహమతుల్లా,టవర్‌మక్బుల్,ఇలియాస్,సాధాతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మలకు అచ్చంపేటలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి


తహసీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందజేత

**ఉప్పునుంతల, మార్చి3 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు అచ్చంపేటలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విశ్వకర్మ యోజన లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం మండల అభివృద్ధి అధికారి మోహన్ లాల్, తహసిల్దార్ ప్రమీలకు వినతి పత్రాన్ని అందజేశారు. విశ్వకర్మ యోజనకు ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణకు హాజరుకావాలని ఫోన్ల ద్వారా సమాచారాన్ని అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రం వనపర్తిలో నిర్వహిస్తుండడంతో ఈ ప్రాంత వాసులకు సుదూర ప్రయాణం చేయాల్సి వస్తుందని, ఆలస్యమైతే శిక్షణకు అనుమతించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజన వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు వారు వివరించారు. అక్కడే ఉండి శిక్షణను పూర్తి చేద్దామనుకుంటే వసతులు లేవని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నల్లమల్ల ప్రాంత విశ్వకర్మ లబ్ధిదారులకు అచ్చంపేట లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## గ్రామాల సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీడీవో జయరాం నాయక్

**నవాబుపేట, మార్చి3, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పల్లెప్రగతి,ఎన్ఆర్‌జిఎస్‌పై సమీక్ష సమావేశం ఎంపీడీవో జయరాంనాయక్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. గ్రామాలలో విత్తనాలు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిం చాలన్నారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు రికార్డులను అప్డేట్ చేయాలని, టాక్స్ కలెక్షన్స్, తదితర అంశాలపై సమీక్ష చేసి అధికారులకు సలహాలు సూచనలు చేశారు. గ్రామలలో నిర్వహి స్తున్న పనులు వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు పీఎస్‌లు టిఏలు, ఎఫ్ఏలు వీరితో పాటు ఎంపీఓ, ఏపీఓ ఈసీ ఏఈ ఇంట్రా ఏఈ గ్రిడ్ అధికారులతో పాటు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మిషన్ భగీరథ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ఎలక్ట్రిషన్ ఏఈ అగ్రికల్చర్ అధికారులతో పాటు ఎఫ్ఏలు కూడా పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

## గర్భిణీ స్త్రీలకు ఎఎన్‌సి వైద్య పరీక్షలు


ఆసుపత్రిలో మహిళలకు వైద్య సేవలు అందిస్తున్న డా. స్వప్న

**ఉప్పునుంతల, మార్చి 3 ప్రభాతవార్త :** ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య వైద్యశాఖ వారి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఎఎన్‌సిసి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని స్థానిక వైద్యురాలు డా.స్వప్న తెలిపారు.ప్రతి నెల జరిగే వైద్య పరీక్షలకు మండలంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు హాజరు కావాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారిని డా. స్వప్నతో పాటు, సూపర్‌వైజర్ ప్రభావతి, ఫార్మసిస్టు కుమార చారి, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## షూటింగ్ బాల్ పోటీల్లో పతకాల పంట

**మక్తల్, మార్చి 3 ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మక్తల్ నియోజకవర్గానికి చెందిన 12 మంది బాల బాలికలు పాల్గొని తమ అసమాన క్రీడా ప్రతిభను చాటి పతకాల పంట పండించినట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన డి. అఖిల,ఎస్.నవ్య శ్రీ,వి. కవిత, జి.రాజేష్,కే. రఘు, ఆర్.స్వప్న, ఎన్.శ్రీలత, కే,గాయత్రి, ఎం.అరుణ, పీ. శ్రావణి, ఎం.మమత, కేపరశురాములు, కే.సురేష్‌లను సోమవారం మక్తల్ పట్టణంలో శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి, షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కంసానిపల్లి హైస్కూల్‌లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**ఉప్పునుంతల, మార్చి 3 ప్రభాతవార్త :** మండలంలోని కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సోమవారం విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. మండల విద్యాధికారిణిగా పావని, కలెక్టర్‌గా కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారిగా కిషన్ సింగ్, మండల విద్యాశాఖాధికారిగా శివ సింగ్ తో పాటు ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్ర శేఖర్, ఉపాధ్యాయులు మేడి పూరి మల్లికార్జున్, కట్ట మల్లారెడ్డి, భాగ్య రేఖ, మహేశ్వరి, బాలకృష్ణ, ప్రభాకర్ రెడ్డి, సలీంలు పాల్గొన్నారు.

## శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న సీనియర్ న్యాయవాది

**మల్దకల్, మార్చి 3 ప్రభాతవార్త :** హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీధర్ మూర్తి వాసవి దంపతులు సోమవారం ఆదిశిల క్షేత్రమైన మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు స్వాగతం పలికి అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రం చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మధుసూదనా చారి, రవి, బాబురావు, చంద్రశేఖర రావు తదితరులు ఉన్నారు.

## ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్‌కి ఎమ్మెల్సీఇవ్వాలి

### ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్

**గద్వాల, మార్చి 3 ప్రభాతవార్త :** గత కొన్ని సంత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కి సేవ చేస్తూ, కాంగ్రెస్ పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమం లో పాల్గొంటు కార్యకర్తలను, నాయకులను కాపాడుకుంటూ ప్రతిపక్షం లో ఎన్ని సమస్యలు ఎదురైనా ఎదుర్కొని పార్టీ ని విడకుండా పార్టీ కోసం పనిచేసిన ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ కి ఎమ్మెల్యే ల కోటా లో శాసన మండలి కి పంపాలి అని ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ సిఎం రేవంత్ రెడ్డి కి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో సామాజిక న్యాయం ఉంటుంది అని మాదిగ సామాజిక వర్గం నుండి ఏఐసీసీ కార్యదర్శి గా ఉంటున్న సంపత్ కుమార్ కి ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించాలి అని జిల్లా కు వెన్నుదన్నుగా ఉంటూ గద్వాల్, అలంపూర్ నియోజకవర్గం లను అభివృద్ధి లో సంపత్ కుమార్ భాగస్వామ్యం సమ న్యాయం గా ఉంటుందన్నారు. కష్ట కాలంలో అలంపూర్ తో పాటు గద్వాల్ కి కూడా నాయకుడు లేని సమయం లో కార్యకర్తలకు, నాయకులకు భరోసా గా నిలిచాడన్నారు. నిజమైన కాంగ్రెస్ నాయకుడు సంపత్ కుమార్ అని అన్నారు. ఇలాంటి నాయకుడు కు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరుకుంటున్నాం అన్నారు. ఈ కార్యక్రమం లో అలంపూర్ నియోజకవర్గం ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ యోనా, దేవరపోగు నరసింహ, రమేష్ తదితరులు ఉన్నారు.

# ప్రేరణ శిక్షణ కార్యక్రమాన్ని తరగతి గదులకు తీసుకెళ్లండి

■ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మార్చి3 ప్రభాతవార్త:** జిల్లా స్థాయిలో నూతన ఉపాధ్యాయులకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నారాయణపేటలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ సిక్తాపట్నాయక్ హాజరై విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో నూతన ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని. టెక్స్ట్ బుక్‌ను ,హ్యాండ్ బుక్కును వర్క్ బుక్ ను అలైన్ చేస్తూ వెనుకబడిన విద్యార్థులు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ జిల్లాను ఎస్ ఎల్ ఎన్ కార్యక్రమంలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు. జిల్లాలోని కొంతమంది ఉపాధ్యాయుల పనితీరు వినూత్నంగా ఉందని అట్టి ఉపాధ్యాయులను ప్రశంసిస్తూనే,ఇటీవల నిర్వహించిన మిడ్లెన్ పరీక్షలో విద్యార్థుల ఫలితాలు మరింత ఆశాజనకంగా ఉండాల్సిందని, ఇకనుంచి తప్పనిసరిగా పాఠశాల సందర్శన సమయంలో తరచుగా మిమ్మల్ని కలుస్తుంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేరణాత్మకమైన తన అనుభవాలను పంచుకుంటూ, ఉపాధ్యాయ వృత్తి యొక్క గొప్పతనాన్ని రాజేశ్వర్ జిహెచ్ఎం వేపూర్ చెప్పారు. డిఈవో గోవింద రాజులు మాట్లాడుతూ ఏ రకమైన బోధనా పద్ధతి తరగతికి సరిపోతుందో అందుకు అనుగుణంగా పలు ఉదాహరణలు తీసుకొని బోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ అధికారి కోర్స్ డైరెక్టర్ విద్యాసాగర్, కోర్సు కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, మద్దూర్ ఎంఈఓ బాలకిష్టప్ప ఏఎస్ఓ శ్రీనివాస్, వివిధ సబ్జెక్టుల డిఆర్పీలు శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, రాఘవేంద్ర,విశ్వనాథ్‌రెడ్డి, సుధీర్,అపర్ణ, శశిధర్‌రెడ్డి, అనిత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

సూర్యరశ్మి తలపై తగలకుండా టోపీ,టవల్ వంటివి ధరించడం చేయాలని చెప్పారు. ఎండలు అధికంగా ఉన్న సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని,ఉదయం,సాయంత్రం సమయంలోనే బయటకు వెళ్లాలని తెలిపారు. చిన్నపిల్లలు,గర్భిణీ లు వయోవృద్ధులు ఎక్కువగా వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ,ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వారికి ఓఆర్ఎస్ ద్రావణంతోపాటు, తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయాలని గ్రామీణాభివృద్ధి అధికారులను ఆదేశించారు. అలాగే ఐసిడిఎస్,ఇతర శాఖలలో ఎండలో ఎక్కువగా పని చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలని,వడదెబ్బకు గురైన వారు తక్షణమే దగ్గరలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్‌ను సంప్రదించాలని, సరైన సలహాలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె.కృష్ణ వడదెబ్బ కారణాలు, నివారణ చర్యలు, ముందు జాగ్రత్త చర్యలపై వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,అర్.డి. ఓ నవీన్,జిల్లా పంచాయతీ అధికారి పార్థ సారథి జిల్లా సంక్షేమ అధికారిని జరీనా బేగం, డిఆర్‌డిఓ నర్సింహులు, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ గౌడ్,జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్,ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డా.శశికాంత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు హాజరయ్యారు.

# యెన్నం ఆశయానికి అడుగులు




సెట్విన్ నిర్వాహకులకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

తెలిపారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి సుశిక్షితులైన అధ్యాపకులను నియమించి, శిక్షణ తరగతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారని ఆయన చెప్పారు. 224మంది మహిళలు మూడు నెలలుగా కంప్యూటర్ , ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషన్ లలో శిక్షణ పొందారని వీరికి ఈ రోజు ఫైనల్ పరీక్షలు సెట్విన్ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. రానున్న నూతన బ్యాచ్ లో మగ్గం వర్క్ పైన కూడా శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. గతంలో శిక్షణ పొందే అవకాశం లభించని వారు ఈ పర్యాయం అడ్మిషన్ పొందవచ్చు అని చెప్పారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి విలువైన సెట్విన్ సర్టిఫికెట్ తో పాటు బ్యాంకుల ద్వారా కూడా వారికి రుణాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ మహబూబ్ నగర్ ఇంచార్జీ విజయ్ కుమార్, మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇంచార్జీ నిజలింగప్ప పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడి మృతి

**బిజినేపల్లి, మార్చి 3 ప్రభాతవార్త:** లట్టుపల్లి పరిధిలోని భీముని తండాకు చెందిన జటావత్ జాను (34)రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. బిజినపల్లి నుండి సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసిన తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి శవాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు. మృతుడికి భార్యకవిత, కుమారుడు అబి, కూతుళ్ల మోనిక, హారికలు ఉన్నారు. మృతుడు ఇటీవలే శివమాలధరించి మూడురోజుల క్రితం శ్రీశైలం వెళ్లి వచ్చినట్లు తండావాసులు చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. మృతునికి గిరిజన సంఘం నాయకులు గోవింద్ నాయక్, మాన్య నాయక్, అమర్‌నాయక్,పూలియా, చందూలాల్, కృష్ణ, రాజు నాయక్ తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పెండింగ్ దరఖాస్తులపై ఫోకస్ పెంచాలి : జిల్లా కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, త్రాగు నీటి సరఫరాపై దృష్టి సారించాలని కలెక్టర్ మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. మండలంలో గ్రామాలు, హ్యాబిటేషన్‌లలో విద్యుత్ సరఫరా, త్రాగునీరు సమస్య లేకుండా వేసవి ముగిసే వరకు పర్యవేక్షించాలని, గ్రామాల్లో ఎటువంటి సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. చిన్న చిన్న రిపేర్‌లు, అత్యవసర పనులకు నిధులు అవసరం ఉంటే వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఎస్.సి.,ఎస్.టి.,బి.సి.,మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు,రెసిడెన్షియల్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.రిపేర్ లకు నిధులు మంజూరు చేసినట్లు విద్యార్థినీ, విద్యార్థులకు ఎటువంటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎల్.అర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ యజమానులు పూర్తి ఫీజు మార్చి 31 లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ పొంద వచ్చని,ప్లాట్ యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్లాట్ క్రమబద్ధీకరణ చేసుకోవాలని అన్నారు. దరఖాస్తులు పంచాయతీ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు త్వరగా వెరిఫికేషన్ నిర్వహించాలని సూచించారు. సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

■ ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్

■ బీసీ, ఎస్సీ హాస్టళ్లను తనిఖీ చేసిన ఎంపీడీవో



ధర్మవరం బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఉదయం టిఫిన్ చేస్తుండగా పరిశీలిస్తున్న ఎంపీడీవో

**ఇటిక్యాల, మార్చి3 ప్రభాతవార్త:** ప్రభుత్వ హాస్టళ్లలో అలాగే గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచిందని అందుకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెట్టాలని ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్ వార్డెన్ జయరాం నాయక్‌ను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో గల బీసీ హాస్టల్‌ను ఎంపీడీవో సందర్శించి తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంటగదిని భోజనానికి ఉపయోగించే కారం, పప్పు ఇతర వస్తువులను పరిశీలించి ఉదయం పూట విద్యార్థులకు వండిన టిఫిన్‌ను విద్యార్థులు తింటుండగా ఎంపీడీవో పరిశీలించారు. అలాగే హాస్టల్ లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు మరుగుదొడ్లు స్నానపు గదులు పనిచేసేలా చూడాలని అలాగే 10వ తరగతి పరీక్షలు వస్తున్న సమయంలో బాగా శ్రద్ధగా ఆసక్తితో చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం పెంచిన విద్యార్థులకు అందిం చే కాస్మోటిక్ చార్జీలు మాకు అందలేదని విద్యార్థులు ఎంపీడీవోకు దృష్టికి తెచ్చారు. అనంతరం వల్లూరులోని ఎస్సీ హాస్టల్ ను ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియు ద్దీన్, ఇన్చార్జి వార్డెన్ జయరాంనాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు ప్రభుత్వ సూచించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండి పెట్టాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పదవ తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభు త్వం విద్యార్థులకు పెంచిన కాస్మోటిక్ చార్జీలు హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఇంఛార్జ్‌వార్డెన్ జయరాం నాయక్ తెలిపారు. ఇక్కడ వర్కర్ల సమస్య ఉన్నట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు.

# సీసీ రోడ్లు నాణ్యవంతంగా ఉండాలి

◆ పంచాయత్ రాజ్ డిప్యూటీ డిఈ లక్ష్మి నారాయణరెడ్డి

**ఖిల్లాఘణపురం, మార్చి3 ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వేసే సిమెంట్ రోడ్లు నాణ్యవంతంగా ఏర్పాటు చేయాలని పంచాయత్ రాజ్ డిప్యూటీ డి ఈ లక్ష్మి నారాయణరెడ్డి అన్నారు. ఇసుక సిమెంటు కంకరలను పంచాయతీరాజ్ ఏ ఈ సూచించిన విధంగా వేయాలన్నారు. సోమవారం ఘణపురం మండల కేంద్రంలో ఎన్ ఆర్ ఈ జీ ఎస్ పథకంలో వేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. సీసీ రోడ్డును నీటితో వారం రోజుల పాటు క్యూరింగ్ చేయించాలని నీటి క్యూరింగ్ ఆపిన తర్వాత సీసీ రోడ్డుకు కోర్ కటింగ్ చేయించాలని చెప్పారు. గుత్తేదారులకు సూచించారు. డి ఈ తో పాటు పంచాయతీరాజ్ ఏ ఈ రమేష్ నాయుడు, గుత్తేదారులు బాలరాజు, నారాయణ పాల్గొన్నారు.

# దర్గా మార్పిడిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

**నవాబుపేట, మార్చి 3 ప్రభాతవార్త:** భూ విక్రయానికి దర్గా అడ్డుగా వచ్చిందని దర్గాను దౌర్జన్యంగా కూల్చివేసి వేరేచోట ప్రభుత్వ భూమిలో నిర్మించడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఎనమనగండ్ల గ్రామంలో గత వారం రోజులుగా ఈ విషయంపై ప్రజల్లో పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఎన్మన్‌గండ్ల శివారులో గండికుంట దగ్గర గల దర్గా కొన్ని ఏళ్ల తరబడి అక్కడే ఉన్న 325 సర్వే నెంబరు లో ఉన్న దర్గాను కూల్చి 330 సర్వే నెంబర్ ప్రభుత్వ గైరాన్ భూమిలోకి మార్చి కట్టడంలో ఏ మహత్యం దాగి ఉందో కానీ గ్రామ ప్రజలకు దర్గాపై పలు సందేహాలకు దారితీస్తుంది. ఈ విషయంపై ముస్లిం పెద్దలు గ్రామవాసులు ఎండి జమీల్, గ్రామస్తులు ప్రజా ప్రతినిధులు మండల అధికారి తహసిల్‌దార్ శ్రీనివాస్‌కు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హమీద్, మహేక్, జమ్మూ కోస్గి రాజు, బ్యాగరి నర్సింలు, కేశవులు ఉన్నారు.

# నూతన ఎస్సైకి ఘన సన్మానం

**ఇటిక్యాల, మార్చి 3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోదండపురం పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా మురళి బాధ్యతలు చేపట్టడంతో సోమవారం మండల బిజెపి పార్టీ ఆదర్యంలో మండల బిజెపి పార్టీఅధ్యక్షులు జగదీష్ రెడ్డి, జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు కేకే రెడ్డీ. ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి,రాముడు, పరుశరాం,యూగెందర్ రెడ్డీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పుష్ప రథోత్సవం

■ మహాశాంతి యజ్ఞం... సంప్రోక్షణ

భక్తులు స్నానం ఆచరించడానికి కుళాయిల ఏర్పాటు

■ నేడు పెద్ద రథోత్సవం



చిన్న తేరును లాగుతున్న భక్తులు



శాంతి యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, మార్చి3 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన గుండాల అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మధ్య రాత్రి ఘనంగా పుష్క రథోత్సవాన్ని భక్తులు లాగి యదా స్థానానికి తీసుకువచ్చారు. శివ రాత్రి రోజు కోనేరులో పడి విద్యార్థి మృతి చెందిన సందర్భంగా సోమవారం దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థాన ప్రముఖ శైవ గామ పండితులు సహస్ర ప్రతిష్టాచార్య బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతి శర్మ ఆధ్వర్యంలో మహా శాంతి యజ్ఞం, మహా సంప్రోక్షణ, మహా శాంతి యజ్ఞం నిర్వహించారు. గుండంలో దిగకుండా కంచె ఏర్పాటు చేయడంతో భక్తుల సౌకర్యార్థం స్నానాలు ఆచరించడానికి మంచినీటి కుళాయిలను దేవాలయ వైస్ చైర్మన్ అరుణ్ నాయక్ టెంకాయలను కొట్టి ప్రారంభించారు. నేడు మంగళవారం మధ్య రాత్రి పెద్ద రథోత్సవాన్ని నిర్వహిస్తారు. భక్తులకు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ ఏర్పాటు చేసిన అన్నదానం కొనసాగుతుంది. ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పర్వత్‌రెడ్డి, ఆలయ ఈఓ ప్రసాద్, ఆలయ అర్చకులు బాలస్వామి శర్మ, కృష్ణయ్యశర్మ, శివప్రసాద్ శర్మ, సంతోష్ శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మతో పాటు భక్తులు ఉన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీటీ

# సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**వెల్దండ, మార్చి 3 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సమస్యలను నేరుగా రాతపూర్వకంగా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని డిటి కిరణ్‌కుమార్ అన్నారు.ఈ సందర్భంగా డిటి మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో ఉన్న సమస్యలను ప్రజలు నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు. సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు విధిగా పని చేసి సమస్యలను పరిష్కరించి ప్రజావాణిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

# ఘనంగా పర్వతాపూర్ మైసమ్మ ఆలయ16వ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అధికారులు, గ్రామ పెద్దలు

**నవాబుపేట, మార్చి3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాకర్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ప్రాచర్యం పొందిన భక్తులకు కోరిన కోరికలను తీర్చే మహిమాన్విత పర్వతాపూర్ మైసమ్మఆలయ 16వ వార్షికోత్సవాన్నిఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ఆలయ ఈవో నరసింహులు కాకర్లపాడు పంచాయతీ సెక్రెటరీ, కమిటీ సభ్యులు,గ్రామస్తుల ఆధ్వర్యంలో అట్టహాసంగా భాజా భజంత్రీలతో నిర్వహించారు. 116 రకాల కలశ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులుఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పాశం రామస్వామి, గడ్డమీద మల్లేష్, కేతవత్ మేఘ్యు, పాశం శివరాజు,బొప్పటి రవీందర్,ఈవో నరసింహులు, ఉలికే ఆంజనేయులు,పిచ్చకుంట్లశాంతయ్య, అంకంరమాదేవి, మురుగని బాల కృష్ణయ్య, కట్టబాలస్వామి బక్కానరసింహులు,బండేనికి రవి,మంగలి రామచంద్రయ్య, గ్రామపెద్దలు, ఆలయఅర్చక సిబ్బంది అర్చక శ్రీకాంత్ శర్మ,భార్గవ్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకర్,రికార్డ్ వెంకట్‌రెడ్డి ఏ.నారా యణరెడ్డి పాశం నరేందర్,కమ్మరిశీను, బక్క బాలయ్య, గ్రామపంచాయతీ విలేజ్ సెక్యూరిటీ శ్రీలత, ఎండి మైనుద్దీన్, కట్ట వీరాంజనేయులు పాల్గొనడం జరిగింది.

# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

**నారాయణపేట టౌన్, మార్చి3 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పర్ణికరెడ్డి చేతుల మీదుగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్ణికరెడ్డి మాట్లాడుతూ చత్రపతి శివాజీ హిందూ ధర్మాన్ని, హిందూ సంస్కృతిని, హిందూ సమాజాన్ని సంరక్షించిన అగ్రగణ్యుడుగా పేరుపొందిన వీరుడు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్‌రెడ్డి, పుట్టి ఈదప్ప, లక్ష్మణ్, శ్రీనివాస్, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్, విహెచ్ పి నాయకులు డా, రాంబాబుతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్ ప్రదర్శన

**నవాబుపేట, మార్చి 3ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. సోమవారం సిద్ధార్థ స్కూల్లో విద్యార్థులు చంద్రయాన్ మెట్రో మెన్ షాప్ ట్రాన్స్పోర్ట్, గ్లోబల్ వార్మింగ్ మానవ శరీర భాగాలు ఇలా పనిచేస్తాయని తెలిసేలా, సర్వమత సమ్మేళనంగా రూపుదిద్దున హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల చారిత్రకమైన కట్టడాలను విద్యార్థులు తయారుచేసి చూపరులను ఆకట్టుకున్నారు. వారి వారి మతాలకు అతీతంగా వారి వేషధారణలో విద్యార్థులు వేషధారణలో అబ్బురపరిచారు. విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు వారి తెలివితేటలను జ్ఞానాన్ని పెంచే విధంగా దోహదపడతాయని స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# భవిష్యత్తు విద్యలో ఏఐ పాత్ర కీలకం

◆ ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్



సెమినార్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు

**మహబూబ్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖ, పిల్లల మర్రి జిల్లా సైన్స్ ఫోరం,జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఏఐ (కృత్రిమ మేధా) అనే అంశంపై మహబూబ్‌నగర్‌లోని ఎఎస్ఎన్‌గార్డెన్ ఫంక్షన్ హాల్ జిల్లాలోని ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ టీచర్లకు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ పాత్ర బోధనలో చాలా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్‌రెడ్డి ప్రొఫెసర్ పాలమూరు యూనివర్సిటీ, రాజశేఖర్, జువాలజీ ప్రొఫెసర్ పాలమూరు యూనివర్సిటీ కళ్యాణ్, కల్వఎంబిబిఎస్, ఫార్మసిస్ట్ ముఖ్యవక్తలుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరమ్ బాధ్యులు పద్మావతి, విజయ భాస్కర్ రెడ్డి, షంషీర్, సాయిబాబా,ఆనంద్,రేవతి, శ్రీహరి,అరుణమ్మ,లక్ష్మి, నీలిమ, బషీర్, జనార్దన్‌రెడ్డి, రమణారెడ్డి, సుజాత జిల్లాలోని భౌతికశాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ప్రత్యేక అధికారితో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బాలిశ్వర్

**బిజినేపల్లి, మార్చి 3 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్ క్యామ బాలీశ్వర్ డిమాండ్ చేశారు. బిజినపల్లి గ్రామపంచాయతీలో కార్మికులుగా పనిచేస్తున్న 28 మంది కార్మికులకు వేతనాలు అనగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ప్రత్యేక అధికారి తహసిల్దార్ శ్రీరాములు కలిసి రెండు నెలలుగా వేతనాలు అందక నిర్లక్ష్యపు వైఖరితో కార్మికుల బతుకులు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ గ్రాట్యుటీ కల్పిస్తూ జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. గ్రామపంచాయతీల్లో కార్మికులుగా పనిచేస్తున్నా వారికి ప్రతి నెలా రావాల్సిన జీతం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమై కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి అన్నారు. ట్రెజరీ ద్వారా రావాల్సిన వేతనాలు సకాలంలో రావడం లేదని వేతనాలందక దినసరి కూలీలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని వివరించారు. పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్‌తో మాట్లాడి వీలైనంత త్వరలో కార్మికులకు వేతనాలు చెల్లించేలా చూస్తానని ప్రత్యేక అధికారి తహసిల్దార్ శ్రీరాములు హామీ ఇచ్చారు. నిరసన తెలిపిన వారిలో గ్రామపంచాయతీ కూలీలు శ్రీశైలం, జస్వంత్ మహేష్,సుభాష్, వీరస్వామి, సుజాత, మంగమ్మ, రాము, మహేష్ తదితరులున్నారు.

# తాగునీటి కోసం గ్రామపంచాయతీ ఎదుట నిరసన



వట్టెం గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

**బిజినేపల్లి, మార్చి3 ప్రభాతవార్త:** వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయని వట్టెం గ్రామానికి చెందిన మహిళలు పంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమస్యను అధికారులకు విన్నవించిన పట్టించుకునే వారు కరువయ్యారని నిరసన వ్యక్తం చేశారు.గ్రామంలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామంలో త్రాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి తాగునీటి సరఫరా సక్రమంగాజరిగేలా చూడాలని కోరారు. సమస్య పరిష్కరించకుంటే ప్రధాన రహదారిపైఆందోళన దిగుతామని హెచ్చరించారు.నిరసన తెలిపిన వారిలో మాజీ ఎంపిటిసి తిరుపతిరెడ్డి,గాండ్ల జగదీశ్వర్, డా.చందర్, మ్యకం చంద్రకళ ,వడ్లచిట్టెమ్మ, గోరిట కిష్టమ్మ, అరిడె లక్ష్మమ్మ ఉన్నారు.

# రాష్ట్ర సమావేశాలు జయప్రదం చేయండి

◆ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

**బిజినేపల్లి,మార్చి3 ప్రభాతవార్త:** తరతరాలుగా అణచివేత అంటరానితనం వివక్షత దోపిడీ, పీడనల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలు అయినా అశేష శ్రామిక కులాల అభ్యున్నతి లక్ష్యంగా ఆవిర్భవించింది దళిత హక్కుల పోరాట సమితి అని జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ అన్నారు. 76 సంవత్సరాల స్వాతంత్ర పరిపాలన కాలంలో నేటికీ దళితులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారు సమానత్వం సామాజిక న్యాయం అభివృద్ధి కులనిర్మూలన కాగితాలకే పరిమితమైనవని ఆయన పేర్కొన్నారు. డా. బి.ఆర్ అంబేద్కర్ గారు దళిత బలహీన వర్గాల హక్కుల కొరకు అభివృద్ధికి రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు కొన్ని సంవత్సరాలుగా పాలకులు అనుసరిస్తున్న తరలికృత ఆర్థిక విధానాలు మరియు ప్రైవేటీకరణ విధానాల వలన రోజురోజుకు ప్రభుత్వ రంగ పరిశ్రమలు స్థాపన లేక ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వలన ప్రభుత్వ కార్యాలయంలో ఉపాధి కల్పించే సంస్థలు లేక కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ విధానాల ప్రవేశ పెట్టడం వలనరిజర్వేషన్లు ఉనికికి ప్రమాదంవచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల ఆర్థిక రాజకీయ సామాజిక హక్కుల పరిరక్షణ ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్‌ని మరింత బలోపేతం చేయాలని వివక్షత నిర్మూలన కొరకు దళితులకు కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈనెల 10,11,12 తేదీలలో వేముల వాడలో రాష్ట్ర వ్యాప్త విస్తృత సమావేశాలు మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని ఆ సమావేశాల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని రాష్ట్రవ్యాప్తంగా విస్తృత సమరశీల పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలు జయప్రదానికి కార్యకర్తలు నాయకులు ఇతర ప్రజాతంత్ర శక్తులు వ్యక్తులు లౌకికవాదులు అందరూసహకరించి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాము, నాయకులు జక్కయ్య, శ్రీశైలం, రాజు, మహేష్, జస్వంత్, అంజి, శ్రీనివాస్, రాజేష్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగనాయక స్వామిని దర్శించుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు



రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

**శ్రీరంగాపూర్, మార్చి 3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో గల శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో శ్రీ రంగనాయక స్వామిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయ కమిటీ వారు చిన్నారెడ్డిని శాలువతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్, శ్రీరంగాపురం టౌన్ అధ్యక్షుడు గోవిందు, కంబలాపూర్ మాజీ ఎంపిటిసి ఎల్లస్వామి, మండల ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా మాజీ ఎంపీపీ జన్మదిన వేడుకలు

**చిన్న చింతకుంట, మార్చి3 ప్రభాతవార్త:** మాజీ ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన జన్మదిన కేకును మాజీ ఎంపీపీ కట్ చేశారు. జన్మదినం సందర్భంగా శుభా కాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రవీందర్‌రెడ్డి, రఘువర్ధన్‌గౌడ్, కాంతారావు, పార్టీ మండల అధ్యక్షులు కోట రాము, యూత్ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, స్వామి, కురుమూర్తి, రియాజ్, నరసింహ, వినోద్, శేఖర్, ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**పెబ్బేరు, మార్చి 3 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. కలెక్టర్ గా గీత, ఆర్‌జెడిగా శివాణి, డిఇఓగా శ్రీలేఖ ప్రధానోపాధ్యాయురాలుగా శివలక్ష్మి చక్కగా నిర్వహిం చారు. విద్యార్థి ఉపాధ్యాయులుచక్కగా భోధించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపా ధ్యాయుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ స్వయం పరిపాలనా ద్వారా, స్కూల్ పని తీరును తమ అనుభం ద్వారతెలుసుకుంటారన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొంద యన్నారు. న్యాయ నిర్ణేతలుగామోహినోద్దీన్ గ్రామ పెద్దలుబాబు స్వరాజ్యంరెడ్డి, ఉపాధ్యా యులు వెంకటేశ్వర్లు, బాలమ్మ, ఈశ్వర్ రెడ్డి, శ్రీధర్, ఇందిరమ్మ ,రమేష్, ఆంజనేయులు, శివాని, అనుష పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

**తెలంగాణ రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ అధ్యక్షులు రాచమల్ల సిద్దేశ్వర్, ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి**



మాట్లాడుతున్న అధ్యక్షులు రాచమల్ల సిద్దేశ్వర్

**నారాయణపేట టౌన్, మార్చి3 ప్రభాతవార్త:** రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కలిసి కట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, తెలంగాణ రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచా యతీ రాజ్ సంఘటన్ అధ్యక్షులు రాచమల్ల సిద్దేశ్వర్, ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ రివ్యూ సమావేశం జరిగిందని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. నిరుపేదల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వాటికోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రసన్న తోబాటు పార్టీ జిల్లా, ఆయా మండలాల నాయకులు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## కలెక్టర్‌కు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నాయకుల వినతి



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మార్చి 3 ప్రభాతవార్త:** అన్ని అర్హతలు ఉన్నా కోటకొండను మండలంగా ప్రకటిం చాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకుల ఆధ్వ ర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో వారు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న కోటకొండ గ్రామాన్ని తక్షణమే మండల కేంద్రంగా ప్రకటించాలన్నారు. కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి నోట ప్రకటిస్తారని అనేక సందర్భాల్లో ఎమ్మెల్యేపర్ణికరెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి ప్రకటించా రన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆశను నిరాశ చేశారన్నారు. ఇప్ప టికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పర్ణికరెడ్డిజిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని కోటకొండను మండలంగా ప్రకటించా లని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తు కార్యాచరణ ఉద్యమాలు చేపడతామని అన్నారు. వినతి పత్రం అందించిన వారిలో నీలి దాము, సలీం, మౌలాలితో బాటు తదితరులు ఉన్నారు.

## యాసంగి పంటలకు సకాలంలో తడి అందించే విధంగా చర్యలు

**వనపర్తి టౌన్, మార్చి 3 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో వేసిన యసంగి పంటలకు సకాలంలో తడి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి యాసంగి పంటలు, ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం వంటి అంశాల పై కలెక్టర్లు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ యాసంగి పంటలకు సాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ సమస్య లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు రెసిడెన్షియల్ పాఠశాలలు తరచుగా సందర్శిస్తూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్లాస్టిక్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే 52 శాతం అధికంగా సాగు చేయడం జరిగిందన్నారు. గత రబీ సీజన్ లో దాదాపు 90 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఈసారి 1.41 లక్షల ఎకరాల్లో సాగు చేయడం జరిగిందన్నారు. ఏదుల, పెబ్బేరు మండలాలకు కొంత ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని జూరాల, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి నీరు వదిలితే సమస్య తీరుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్తు కు జిల్లాలో ఎలాంటి సమస్య లేదని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, విద్యుత్ శాఖ ఎస్. ఈ రాజశేఖర్, ఇరిగేషన్ ఎస్. ఈ. సత్యనారాయణ, ఇరిగేషన్ ఈ. ఈ లు, డి. ఈ లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గుంటకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అందిస్తున్న సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి
- సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలి
- అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ



ఉప్పునుంతలలో వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, మార్చి 3 ప్రభాతవార్త:** నియోజక వర్గంలోని ప్రతి గుంటకు సాగునీరు అందించ డమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమ వారం మండల కేంద్రమైన ఉప్పునుంతల అచ్చం పేట ప్రధాన రహదారిలో ఉన్న గోదాం వద్ద వేరు శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. టి.జి మార్క్ ఫెడ్, నార్క్‌ఫెడ్, ఎన్ సి సి ఎఫ్ ఆధ్వ ర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు ధరపై వేరుశనగ కొనుగోలు చేయడానికి యావత్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో కనీస మద్దతు ధర 6783 కు కొను గోలు చేస్తుందని మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లమల్ల ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూచనల మేరకు రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేయాలని, సాగునీరుకు పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు పడిన నియోజకవర్గంలోని ప్రతి గుంటకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ఉప్పు నుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అందిస్తున్న సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, రైతు సంక్షేమ కోసం అహర్నిశలు పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రతిపక్షాలు అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని, వాటిని తిప్పికొట్టేందుకు ప్రతి కార్యకర్త నడు బిగించాలని సూచించారు. అచ్చంపేట నియోజకవర్గం అభి వృద్ధే తమ లక్ష్యమని ఇటీవల శ్రీ ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిం దని, త్వరిత గతిన పనులు పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల వరకు గ్రామాల్లో సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు నాయ కులు కృషి కోరారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే గిట్టుబాటు ధర లభించి కొనుగోలు చేస్తుందని రైతులు ఎక్కడ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, గత పది సంవత్సరాల నుంచి ప్రాథమిక వ్యవసాయ పర పతి కేంద్రంలో వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని నిలిపివేయడం జరిగిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులను అదు కోవడమే తమ లక్ష్యంతో గ్రామస్థాయి రైతులు వ్యవసాయ మార్కెట్ వెళ్లి ఇబ్బందులు ఎదుర్కో కుండా స్థానికంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రంలో వేరుశనగ విక్రయించుకు నేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, రైతు లు కొనుగోలు కేంద్రానికి వేరుశనగ తీసుకొచ్చే సమయంలో కనీసం 65 గ్రాముల పల్లీలు, తేమశాతం 85 శాతం పైబడి ఉండేలా వేరుశనగ కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకురావాలని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తోపాటు డిసిఓ రఘునాథరావు, ఆఫీస్ సూపరిం టెండెంట్ మధురావు, డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, కొండనాగుల విండో చైర్మన్ నరసయ్య యాదవ్, తెలంగాణ సీడ్ డిఎం ఆదినారాయణ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ఎంపిడిఓ మోహన్ లాల్, ఉప్పునుంతల, కొండనాగుల, తెల్కపల్లి సంఘ సిఇఓలు కొత్త రవీందర్ రావు, రాజావర్ధన్‌రెడ్డి, ధర్మవీరు, సింగిల్ విండో డైరెక్టర్ సూరం నారాయణరెడ్డి, ఆలూరి శ్రీనివాసులు, బోడ లింగమయ్య, సాయిబాబు, అచ్చంపేట వ్యవ సాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గోపిరెడ్డి రమేష్ రెడ్డి, వంద్యాల మల్లారెడ్డి, రత్లావత్ కృష్ణ, శ్రీ ఉమామహేశ్వర డైరెక్టర్లు బొల్లె లక్ష్మయ్య, స్థానిక నాయకులు కొత్త చిన్న జంగిరెడ్డి, కట్ట శ్రీని వాసు రెడ్డి, బీసీసెల్ మండల నాయకులు మడ్డి తిరుపతయ్యగౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింత గాళ్ళ శ్రీనివాసులు, భాస్కర్, శేఖర్ గౌడ్, తిప్పర్తి జగన్మోహన్‌రెడ్డి, కదిరకృష్ణయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మాధవరెడ్డి ఉచిత వైద్య సేవలకు గౌరవం

- కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జిల్లెల మాధవరెడ్డి పేరు పెట్టడం ఆనందదాయకం
- 6 గ్రామాలు, 13 గిరిజన తండాలలో 4 వేల ఎకరాలకు సాగు నీరు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 3 ప్రభాతవార్త:** స్వర్గీయ డా. జిల్లెల్ల మాధవరెడ్డి అందించిన ఉచిత వైద్య సేవలకు గౌరవం దక్కిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమ వారం తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్రామాలు, 13 గిరి జన తాండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరందించే కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, సీఎం రేవంత్ రెడ్డి ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌కు జిల్లెల మాధవరెడ్డి పేరు పెట్టడంఆనందదాయకమన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌తో కాశింనగర్, జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తయిపల్లి, అంజనగిరి గ్రామాలతో పాటు మరో 13 గిరిజన తాండాలకు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తుందని తెలిపారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండటం వల్ల మాధవరెడ్డి (కాశింనగర్)లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారని ఆయన అన్నారు. బి8 నుంచి రామన్న గట్టు రిజర్వాయర్‌కి నీళ్లు తెచ్చి అక్కడి నుంచి మూడు లిఫ్టుల ద్వారా ఆ ప్రాంత రైతన్నలకు సాగునీరు అందిస్తా మని వివరించారు. మొదటి లిఫ్టు ద్వారా కాసిం నగర్ కు 1000 ఎకరాలకు సాగునీరు అందుతుందని రెండో లిఫ్ట్ దత్తాయపల్లి అంజరగిరికి 1000 ఎకరాలకు సాగునీరు అందుతుందని మూడో లిఫ్ట్ జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తయిపల్లికు 2000 ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. రేపటి నుంచిసర్వే పనులు శరవేగంగా మొదలవుతు న్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ,రాష్ట్ర మైనార్టీ నాయ కులు కమర్ మియా, జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోట్ల రవి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు బాబా, రామేశ్వర్ రెడ్డి, కోళ్ల వెంకటేష్, మెంటేపల్లి రాములు, రణధీర్, సురేష్ గౌడ్, అబ్దుల్లా, వెంకటేష్, విజయ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ టవర్‌కు జీవో ఉంటే చూపించండి

- గత ప్రభుత్వం వనపర్తిని విధ్వంసం చేసింది
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మార్చి3 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని నాగ వరంలో మాజీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన ఐటీ టవర్ కు జీవోనే లేదని కేవలం లెటర్ సమర్పించి శంకుస్థాపన చేశారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హైదరాబాద్ తెలంగాణ భవన్లో ప్రెస్ మీట్ పెట్టి రూ.500 కోట్లతో మాజీ సీఎంకేసీఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఫౌండేషన్ వేశారని, దానిని తిరిగి మళ్లీ రేవంత్ రెడ్డితో ఫౌండేషన్ వేయించారనడం విడ్డూరంగా ఉందన్నారు. మేము వేసిన ఫౌండేషన్ మెడికల్ కాలేజీకి కాదని, ప్రభుత్వ ఆసుపత్రికి అని ఆయన తెలిపారు. జీవో లేని ఐటీ టవర్‌కు శంకుస్థాపన చేసినందుకు కేటీఆర్‌పై, అప్పుడున్న మాజీ మంత్రిపై కేసులు వేస్తామన్నారు. వనపర్తిని టిఆర్ఎస్ నాయకుల పాలనలో ధ్వంసం చేశారని, వారు ఏ అభివృద్ధి కార్యక్రమాలు మొదలుపెట్టిన కేవలం వారి అనుచరులకువారి కుటుంబ సభ్యులకు ఉపయోగపడే విధంగా చేశారన్నారు. నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలోమాకు తెలుసునని, మరో రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల నిధుల పేరుతో హంగామా..

- శంకుస్థాపనల పేరుతో హడావుడి ..
- పనులు ఎంత కాలంలో పూర్తి చేస్తారని సిఎం చెప్పకపోవడం విడ్డూరం
- బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు నారాయణ

**వనపర్తి క్రైమ్, మార్చి3 ప్రభాతవార్త:** వేయి కోట్ల నిధులతో శంకుస్థాపనలని హంగామా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు నారాయణ ఎద్దేవా చేశారు. సోమవారం జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంకుస్థాపనల పేరుతో కేవలం హడావుడి తప్ప శంకుస్థాపనలు మాత్రం కేవలం రూ. 550 కోట్లకే పరిమితమయ్యాయని ఆయన విమర్శించారు. పనులుఎంత కాలంలో పూర్తిచేస్తారని ముఖ్యమంత్రి చెప్పకపో వడం విడ్డూరమని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని విమర్శించడం బిజెపి తీవ్రంగా ఖండిస్తుం దని అన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగారని రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అన్ని పార్టీల కండువాలు మార్చిన చరిత్ర నీదని ఓటుకు నోటు కేసులో ఏ క్షణంలోనైనా తీర్పు వస్తే జైలుకు వెళ్లాల్సిన నీవు కిషన్ రెడ్డి మీద విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో 8మంది శ్రమజీవుల ఆచూకీ ఇంతవరకు లేక వారం రోజులైనా బాధ్యతగల ముఖ్యమంత్రి సందర్శించడానికి సమయం దొరకలేదని మీరు చేసిన రూ. 550 కోట్ల అభివృద్ధి పనులలో కేంద్రం వాటా ఉందనే విషయాన్ని గుర్తుంచుకొని మాట్లాడాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం లేకపోతే ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టే దమ్ము కాంగ్రెస్ పార్టీకి లేదని రైతురుణమాఫీకి పదివేల కోట్లు అప్పుకు కేంద్ర ప్రభుత్వ గ్యారెంటీ కొరకు కిషన్ రెడ్డి ఇంటికి పోయి బతిమిలాడిన విషయాన్ని మరిచి పోవద్దని కిషన్ రెడ్డి లేకపోతే మామునూరు ఎయిర్‌పోర్ట్ రీజినల్ రింగ్ రోడ్డుదక్షిణభాగం హైదరాబాద్ మెట్రో గిరిజన విశ్వ విద్యా లయం రామగుండం ఎరువుల కర్మాగారం, పసుపు బోర్డు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటయ్యాయనే విషయాన్ని గుర్తుంచు కొని మాట్లాడాలని కిషన్ రెడ్డి పై చేసిన విమర్శలకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్, జిల్లా కోశాధికారి బాసెట్టి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జిల్లా మీడియా ఇన్చార్జి పెద్దిరాజు, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు కుమార్ బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు గడాల గోపీనాథ్ యాదవ్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్ చారి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మార్చి17 లోపు క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియ..**

# వందశాతం పూర్తి చేయాలి

■ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వైద్య అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మార్చి 3 ప్రభాతవార్త:** మార్చి 17 నాటికి జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియ వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో క్షయవ్యాధి, మిషన్ మధుమేహ, పిల్లలకు టీకాల కార్యక్రమంపై వైద్య అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ జిల్లాలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఎక్స్‌రే, స్పూటం పరీక్షల ద్వారా పరీక్షలు నిర్వహించి క్షయ వ్యాధి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వనపర్తి జిల్లాలో 1.60 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలి పారు. ఇప్పటి వరకు 1.26 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వ హించడం జరిగింది. దీనిని వందశాతం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో281 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించడం జరిగింది. క్షయ వ్యాధిగ్రస్తులతో కాంటాక్ట్ లో ఉంటూ వారికి పూర్తి చికిత్స అందించి వ్యాధి నుంచి విముక్తి కల్పించాలని సూచించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇప్ప టికే ఖరీదైన మొబాయిల్ ఎక్స్‌రే మిషన్లు కొని ఇవ్వడం జరిగింది. మిషన్ మధుమేహంపై సమీక్షిస్తు జిల్లాలో 2.30 లక్షల మందికి మధుమేహం వైద్య పరీక్షలు నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు లక్ష మందికి మాత్రమే పరీక్షలు పూర్తి చేయడం జరిగింది. మిగిలిన వారిని మార్చి 20 వరకు వైద్య పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. మధుమేహంపై ప్రజల్లో అవగాహన కల్పిం చాలని, ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి, ఎలాంటి పానీ యాలు తీసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించి జిల్లా లో మధుమేహం వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 23 వేల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. పిల్లలకు సమయానుసారం ఇవ్వాల్సిన టీకాలు సకాలంలో ఇవ్వాలని సూచించారు. పిల్లలకు ఇవ్వాల్సినటీకాలు ఏఒక్కటి పెండింగ్ ఉండకూడదని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో టీకాలు ఇవ్వడంలో లక్ష్యం సాధించకపోవడం పై మెడికల్ అధికారులను ప్రశ్నించారు. గర్భిణీలకు సకాలంలో ఏఎన్‌సి నమోదు చేయించడం, వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవాలు జరిగేవిధంగా కృషి చేయాలని ఆదేశించారు. గర్భిణీల నమోదు సరిగ్గా చేయని ఆశా వర్కర్ల పై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలియో రహిత సమాజం కొరకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ క్యాలెండర్‌ను వైద్య సిబ్బందితోకలిసిఆవిష్కరించారు. జిల్లావైద్య అధికారి డా.శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సాయినాథ్, డా. పరిమళ, డా. రామచంద్ర రావు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఆసుపత్రులకు, డయాగ్నస్టిక్ సెంటర్లకు**

## నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతులు

■ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి టౌన్, మార్చి3 ప్రభాతవార్త:** వైద్య ఆసుపత్రులు, డయ గ్నోస్టిక్ సెంటర్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం వనపర్తి జిల్లాలో కొత్తగా ప్రైవేట్ ఆసుపత్రు లు, డయగ్నోస్టిక్ సెంటర్లు, డెంటల్ ఆసుపత్రులు నెలకొల్పేందుకు అనుమతుల కొరకు పెట్టుకున్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ పరిశీలించింది. దరఖాస్తులో పొందుపరచిన విషయాలు, ఆసుపత్రుల్లో ఉన్నసదుపాయాలు, డాక్టర్ల వివరాలను కమిటీలో క్షుణ్ణంగా పరిశీలించారు. క్లినికల్ యాక్ట్ ప్రకారం అన్ని సరిగ్గా ఉన్న వాటికి అనుమతులు మంజూరు చేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, జిల్లా వైద్య అధికారి శ్రీనివాస్, డిఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్